క్లుప్తంగా

స్పీకర్‌కు సన్మానం



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి

షాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఘనంగా సన్మానించినట్లు మద్దూరు మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జీ పామెన భీంభరత్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొల్లూర్‌గూడ, చందనవెల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేస్తున్నామని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చేవెళ్ల: నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 97 మంది ప్రజలకు చెక్కులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

షాద్‌నగర్ : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా ముగిసింది. మంగళవారం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అధ్యక్షతన మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు హాజరవగా పలువురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి అంశాలపై చర్చించి తీర్మానాలు ప్రవేశపెట్టారు. సమావేశంలో కౌన్సిలర్లు వెంకట్రామిరెడ్డి, ఈశ్వర్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, బచ్చలి నర్సింహ, నందీశ్వర్, కొందూటి మహేశ్వరీ, జూపల్లి కౌసల్య, చెట్ల పావని, ప్రేమలత, కో–ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

ఏఓ రాజేందర్‌రెడ్డి

కొందుర్గు: శనగ విత్తనాలు నాటే ముందుగా విధిగా విత్తన శుద్ధి చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ మండల వ్యవసాయాధికారి రాజేందర్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం శనగ విత్తనాలు నాటేందుకు అనుకూలమైన సమయమన్నారు. నవంబర్ మాసం దాటిన అనంతరం విత్తనాలు నాటితే దిగుబడి తగ్గే పరిస్థితి ఉంటుందన్నారు. చౌడు నెలలు శనగ పంటకు అంత అనుకూలించవన్నారు. ప్రస్తుతం రైతులకు రాయితీపై అందించేందుకు జేజీ–11, జాకీ–9218, ఎన్‌బీఇజీ–49 రకాల శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు నాటేముందు కిలో విత్తనాలకు 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి కలపాలని సూచించారు. విత్తనాలు విత్తే ముందు ఫ్లూక్లోరాలిన్ 45 శాతం మందును ఎకరానికి లీటరు చొప్పున పిచికారీ చేసి, భూమిని కలియదున్నాలన్నారు. విత్తిన 24 గంటలలోపు పెండిమెథాలిన్ 30 శాతం మందును ఎకరాకు లీటరు పిచికారీ చేయాలన్నారు. అలాగే 30, 10 సెంటిమీటర్ల దూరంలో విత్తనాలు నాటుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల గంధకాన్ని ఇచ్చే ఎరువులను దుక్కిలో వేసుకోవాలని సూచించారు. ఈ సలహాలు పాటిస్తే శనగలో మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

కూడళ్ల మూసివేతతోనే సరి!

- ప్రత్యామ్నాయం ఎక్కడో మరి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదాల నివారణలో భాగంగా మూసిన వైజంక్షన్ కూడలి



వైజంక్షన్ కూడలిలో రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టి మూసిన దారి

కొత్తూరు: పట్టణం నుంచి సోలీపూర్ శివారు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర 2009లో బైపాస్ రోడ్డును నిర్మించారు. కాగా అప్పట్లో కూడళ్ల వద్ద వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించలేదు. దీంతో కూడళ్ల వద్ద రోడ్డు దాటే క్రమంలో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని కూడళ్ల వద్ద ప్రమాదాల తీవ్రత మరీ ఎక్కువగా ఉండడంతో గత కొన్నేళ్ల క్రితం ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు శాఖ అధికారులు తాత్కాలికంగా పలు కూడళ్లను మూసివేశారు. కానీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు మాత్రం చేపట్టలేదు. ఫలితంగా రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు రోడ్డు దాటాలంటే కిలోమీటర్ల దూరం అదనంగా వెళ్లాల్సి వస్తుంది. కొన్నిచోట్ల అండర్‌పాస్‌లు ఉన్నప్పటికీ ద్విచక్ర వాహనాలు, కార్లు, వెళ్లడానికి మాత్రమే అనుకూలంగా ఉన్నాయి. వర్షాకాలంలో వీటి నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అధికారుల చర్యల కారణంగా బైపాస్ రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూసివేసిన కూడళ్లు ఇవే..

- కొత్తూరు పట్టణ సమీపంలోని వై జంక్షన్ కూడలీలో ప్రమాదాల నివారణలో భాగంగా బారికేడ్లతో కూడలీని మూసివేశారు. దీంతో పట్టణంలోకి వచ్చే వాహనదారులు పెంజర్ల కూడలీలో యూటర్న్ తీసుకొని పట్టణంతో పాటు పాత జాతీయ రహదారిపైకి వస్తున్నారు.
- నందిగామ మండలం ధన్‌సింగ్‌తండా కూడలీ వద్ద రోడ్డుదాటే క్రమంలో ఒకే తండాకు చెందిన వారు పదుల సంఖ్యలో మృతి చెందారు. దీంతో అధికారులు గత ఎనిమిదేళ్ల క్రితం కూడలీని పూర్తిగా మూసివేశారు. దీంతో తండావాసులు పట్టణంతో పాటు కొత్తూరుకు రావడానికి అదనంగా రెండు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది.
- నందిగామ మండలం మేకగూడ జంక్షన్‌ను అధికారులు మూడేళ్ల క్రితం మూసివేశారు. దీంతో దారిలేని కారణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. విద్యార్థులతో పాటు రైతులు కూడలీ మూసివేత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.
- నందిగామ మండలం బండకుంటతండా వద్ద ఉన్న కూడలీలో రోడ్డు దాటే క్రమంలో ఇదే తండాకు చెందిన వారు పదుల సంఖ్యలో మృతి చెందారు. ప్రమాదాల తీవ్రత దృష్ట్యా అధికారులు ఏడేళ్ల క్రితం కూడలీని శాశ్వతంగా మూసివేశారు. సమీపంలో వరదనీరు వెళ్లేందుకు రోడ్డుపై నిర్మించిన కల్వర్టు ఉన్నా అందులో నుంచి కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లు మాత్రమే రాకపోకలు కొనసాగిస్తున్నాయి. వర్షాకాలంలో షాద్‌నగర్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సిందే.

ప్రత్యామ్నాయం ఎక్కడా?

ప్రమాదాల నివారణలో భాగంగా అధికారులు పలు కూడళ్లను మూసివేసి చేతులు దులుపుకున్నారు. అంతే తప్పా సమీప గ్రామాల ప్రజలు రోడ్డు దాటేందుకు వీలుగా ఇప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టలేదు. దీంతో రోడ్డు దాటేందుకు వారు కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది.

వంతెనల నిర్మాణంతోనే ప్రమాదాల నివారణ



కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు ఉన్న బైపాస్ రోడ్డుపై ఆయా కూడళ్ల వద్ద వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించాలి. వాటితోనే కూడళ్ల వద్ద ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించొచ్చు. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి పరిస్థితిపై చర్చించా. వారి నుంచి సానుకూలమైన స్పందన రావడంతో సాధ్యమైనంత త్వరగా వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించడానికి కృషి చేస్తున్నాం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

దీపావళి మార్కెట్ డల్!

- వెలవెలబోతున్న ప్రమిదలు, దొంతుల దుకాణాలు
- మండుతున్న ధరలు, ఆర్థిక సమస్యలే కారణం



వెలవెలబోతున్న ప్రమిదలు, దొంతుల దుకాణాలు

చేవెళ్ల: దీపావళి పండుగ వచ్చిందంటే వ్యాపారులు దుకాణాల్లో లక్ష్మీపూజలకు సిద్ధం అవుతుంటారు. చిన్నాపెద్ద తేడా లేకుండా జరుపుకునే పండుగ దీపావళి. ఈ పండుగ అంటే ముందుగా టపాకాయలే గుర్తుకొస్తాయి. రెండురోజులు ముందు నుంచే మండల కేంద్రంలో టపాసుల దుకాణాలు, దొంతులు, ప్రమిదలు విక్రయించే దుకాణాలు రోడ్ల వెంట వెలిశాయి. ప్రత్యేకంగా వెలిసిన ఈ దుకాణాల్లో మంగళశారం సందడి మాత్రం పెద్దగా కనిపించలేదు. ధరలు ఎక్కువగా ఉండటంతో కొనేవారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. టపాసుల దుకాణాలు పెట్టేందుకు ఇంకా సిద్ధం చేస్తున్నారు. రియల్ వ్యాపారం లేకపోవటంతో చేవెళ్ల ప్రాంతంలో వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. చిరువ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారులు, దుకాణాదారులు దీపావళి పండుగకు లక్ష్మీ పూజలు చేసేందుకు దుకాణాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. గతేడాది రెండు, మూడురోజుల ముందు నుంచే దుకాణాల్లో కొనుగోలుతో సందడిగా కనిపించిందని దుకాణాదారులు పేర్కొంటున్నారు. పండుగకు ఒక్కరోజే ఉండటంతో తమ వ్యాపారం బుధవారం ఒక్కరోజుపైనే ఆధారపడి ఉందని అంటున్నారు.



చేవెళ్లలో వెలిసిన దుకాణాలు

‘అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ పాలించిన పదేళ్ల కాలంలో అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను ఎందుకు కేటాయించలేరని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేతలు బాబర్‌ఖాన్, రఘునాయక్, కొంకళ్ల చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్‌లు ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఎందుకు డబుల్ ఇళ్లు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. షాద్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం అధికారులే అర్హుల తుది జాబితాను తయారు చేశారని చెబుతున్న బీఆర్‌ఎస్ నేతలు వారికి ఎందుకు ఇళ్లు ఇప్పించలేదన్నారు. ప్రజల మధ్య గందరగోళం సృష్టిస్తూ రాజకీయం చేస్తున్నది బీఆర్‌ఎస్ నేతలేనన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఇందిరమ్మ కమిటీలు కొత్తవి కాదని, అవి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఇందిరమ్మ కమిటీలకు, డబుల్ బెడ్రూం ఇళ్లకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నిజమైన లబ్ధిదారులకు గుర్తించి వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తుందని, త్వరలో లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్, ఇబ్రహీం, చంద్రశేఖర్, కబీర్, జాఫర్, హైదర్‌గోరి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మినీ యూనివర్సల్ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ‘ప్రజా సమస్యలు–పరిష్కార మార్గాలు’ అనే అంశంపై డివిజన్ స్థాయి సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగిస్తున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పలా మారిందని ఆరోపించారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ మిగులు బడ్జెట్‌లో ఉందని, కేసీఆర్ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహిస్తున్నారని, వారి పోరాటాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య హాజరై మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు పేదల ఓట్లతో గెలిచి గద్దెనెక్కాక కోట్లు సంపాదించుకుంటున్నారే తప్పా ఓట్లు వేసిన ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. భేటీ పడావో–బేటీ బచావో అని చెప్పిన మోదీ ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులను అరికట్టడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజా పోరాటాలకు ఎర్రజెండా నాయకత్వం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లేశ్, జిల్లా అధ్యక్షుడు అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

‘హామీల అమలులో ప్రభుత్వం విఫలం’

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ యువ నాయకుడు కుమ్మరి మహేశ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే బీజేపీ ప్రజల తరఫున పోరాటాలు చేస్తుందని ఆయన హెచ్చరించారు.

బీజేపీ సభ్యత్వానికి విశేష స్పందన

పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: జిల్లాలోనే అత్యధిక బీజేపీ సభ్యత్వ నమోదులో మొయినాబాద్ మండలం టార్గెట్‌కు దగ్గరలో ఉందని పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ గ్రామస్థాయి నుంచి దేశస్థాయికి ఎదగడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతో అవసరమన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారికి అందేలా పరిశీలిస్తున్నామని తెలిపారు. బీజేపీ సభ్యత్వ నమోదులో జిల్లా ప్రతినిధులు ఇచ్చిన టార్గెట్‌ను త్వరలోనే పూర్తిచేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, కార్యదర్శి పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, మండల సభ్యత్వ కో–ఇన్‌చార్జీ యాదయ్యయాదవ్, శ్రీనివాస్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేశ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, బూత్ అధ్యక్షులు శ్రీధర్, శివకుమార్, రవీందర్‌రెడ్డి, భీమ్‌చందర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విద్యార్థులతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎంతో కాలంగా ఫీజురీయింబర్స్, స్కాలర్‌షిప్ కోసం పేద విద్యార్థులు ఎదురుచూస్తున్నారన్నారు. నిధులను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో చాలా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒకే దఫాలో స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివ, సాగర్, అఖిల్, యశ్వంత్, తరుణ్, చందు, మోజెస్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకం

మొయినాబాద్‌రూరల్: దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీ గ్రూప్ విద్యాసంస్థలో గల భాస్కరా లా కళాశాలలో నిర్వహించిన ఓరియంటేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ చంద్రయ్య పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సమాజంలోని పోరాటాలు, దేశంలో స్వాతంత్య్ర సమరయోధులుగా మారిన న్యాయవాదుల పాత్రను విద్యార్థులకు వివరించారు. న్యాయవాదులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ పీజీఆర్‌ఆర్‌సీడీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.బి.రెడ్డి, జేబీఆర్‌ఈసీ విద్యాసంస్థల కార్యదర్శి జే.బీ. కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ భగవత్‌గీత తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలించాలి

ప్రజ్వల ఎన్‌జీఓ రాష్ట్ర సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ

షాబాద్: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో సమాజ జాగృతి సంఘాల పాత్ర కీలకమని ప్రజ్వల ఎన్‌జీఓ రాష్ట్ర సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, చేవెళ్ల ఇన్‌చార్జి సీడీపీఓ సునీత పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేర పూరితమైన చర్యను ఆదిలోనే అడ్డుకోవాలన్నారు. పేద, మధ్య తరగతి వారిపైనే ఎక్కువగా ఇలాంటి దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి గ్రామం, పాఠశాల, మహిళా సంఘాలలో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి, సమస్యలకు పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తున్నామన్నారు. మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ఐసీడీఎస్, ప్రజ్వల ఎన్‌జీఓ ద్వారా ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజ్వల కో–ఆర్డినేటర్ సురేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సృజన, రాణి, పారిజాత, శ్రీలక్ష్మి, రమాదేవి, ప్రజ్వల ప్రతినిధులు అంబర్‌సింగ్, మిథాళి రాజ్, చెన్నకేశవ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు